

ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి సోమవారం నవంబర్ 02,2026

కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ ని ఘనంగా సన్మానించిన

దమ్మన్నపేట గౌడ సంఘ సభ్యులుగీ

గంభీరావుపేట నవంబర్ 1 (విజన్ ఆంధ్ర)



గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ మరియు దమ్మపేట గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రం గౌడులను గౌడ సంఘ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బంగ్లా రాజు గౌడ్, గ్రామ గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముద్విన్ గ్రామంలో ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ రేకుల షెడ్ నిర్మాణానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆర్థిక సహాయం

భక్తుల సౌకర్యార్థం విరాళం అడిగిన వెంటనే స్పందించి చెక్ అందజేత

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 01 :

కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు టాస్క్ సి .ఓ.ఓ



అయిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ. 2,00,000 (రెండు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారుఆలయాన్ని సందర్శించిన సుంకిరెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆలయ అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. తద్వారా నిత్యం ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పర్వదినాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల సమయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించవచ్చని తెలిపారు. ఈ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.వెంటనే స్పందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి రేకుల షెడ్ నిర్మాణం కోసం రూ. 2,00,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహకారం అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు ప్రజల విశ్వాసానికి, ఆధ్యాత్మిక జీవనానికి ప్రతీకలని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. గ్రామస్తులు కోరిన మేరకు ఆలయ రేకుల షెడ్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని అన్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి కోసం రేకుల షెడ్ నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరిన వెంటనే స్పందించి రూ. 2 లక్షలు అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సహకారం ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక పూజల సమయంలో భక్తులకు నీడతో కూడిన సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సుంకిరెడ్డి ఆర్థిక సహాయం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. ఆయనకు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొగాకు సంధ్య వెంకటేష్, వార్డు సభ్యులు ఈర్లపల్లి మల్లేష్, రాశిక శ్రీను, మంకాల శ్రీను, సంధూరి కృష్ణ, సీనియర్ నాయకులు కావటి జంగయ్య యాదవ్, జంగం శ్రీను, పొగాకు వినోద్, నక్కపోతు మధు, ఏదుల వెంకటేష్, సురేష్, సైదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో అలసత్వం.. లైసెన్స్‌డ్ సర్వేయర్ సస్పెన్షన్:

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ గరిమ అగ్రవాల్.

సిరిసిల్ల టౌన్ నవంబర్ 01 (విజన్ ఆంధ్ర):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామానికి చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎం. బాలకృష్ణ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఉత్తర్వులు జారీ చేశారు.?తొలి దశలో భాగంగా జిల్లాలోని 70 గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, కుర్దులింగంపల్లిలో సర్వే విధులకు కేటాయించిన బాలకృష్ణ గత కొన్ని రోజులుగా హాజరుకాకుండా అలసత్వం వహించారు. ఈ అంశంపై సీరియస్ అయిన కలెక్టర్, ఆయన లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం



తీసుకున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన రీ సర్వే విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

తెలంగాణలో కరెంట్ బిల్లుల మోత, రూ.5,420 కోట్ల భారం ప్రజలపై

ట్రూ అప్ ఛార్జీల పేరుతో రెండేళ్ల పాటు అదనపు వసూలుకు సిద్ధం

నవంబర్ నెలలో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసలు

టీజీఎన్‌పీడీసీఎల్‌కు 29 నెలలు, టీజీఎన్‌పీడీసీఎల్‌కు 26 నెలల పాటు వసూలుకు అనుమతి

ఎల్‌నినో కరువు కష్టకాలంలోనే ధరలు పెంచిన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

గృహ జ్యోతి ఫ్రీ కరెంట్ అంటూనే మూడేళ్లలోనే మోసం చేసినట్టే

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 01:

తెలంగాణలో పెరిగిన కరెంట్ బిల్లులతో ప్రజలపై భారీ భారం పడనుంది. రూ. 5,420.23 కోట్ల ట్రూ అప్ ఛార్జీలను ప్రజల నుంచి వసూలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు సంబంధిత విద్యుత్ సంస్థలకు అనుమతి లభించింది. దీంతో వచ్చే నెల నుంచే ప్రతి యూనిట్ విద్యుత్ వాడకంపై అదనపు ఛార్జీ వసూలు కానుంది.

ట్రూ అప్ ఛార్జీలు అంటే గతంలో విద్యుత్ కొనుగోలు కోసం ఖర్చు చేసిన మొత్తానికి, ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తానికి మధ్య ఉన్న తేడాను తిరిగి వసూలు చేయడమే. ఇంధన ధరలు పెరగడం, విద్యుత్ కొనుగోలు ఖర్చు పెరగడం వంటి కారణాలతో ఈ తేడా ఏర్పడుతుంది. ఆ తేడాను నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు అనుమతి



2లో..

గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఎల్లంకి యాదగిరి



మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ ఎల్లంకి యాదగిరి గ్రామ గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ. గౌడ కులస్తులందరికీ అండగా ఉంటానని అన్నారు,నన్ను అధ్యక్షులుగా ఎంపిక చేసిన గౌడ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో. ఉపాధ్యక్షులుగా అయితగౌని సైదులు, నకరికంటి యాదగిరి కోశాధికారి,అయితగోని మల్లేష్, ఎల్లంకి యాదయ్య, అయితగౌని యాదయ్య, వెంకన్న,నరసింహ, చంద్రయ్య, స్వామి,పల్లె లింగస్వామి,చేనగోని శ్రీను, తదితరులు,పాల్గొన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వేలో ముగ్గురికి జ్వరం

28 మందికి వైద్య చికిత్స.. ముగ్గురి రక్త నమూనాలు ల్యాబ్‌కు



శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి, వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. మరో 28 మందికి వైద్య చికిత్స అందించారు.
అదేవిధంగా గ్రామ వీధులు, మురికి కాల్వల్లో దోమల నివారణకు స్ప్రే చేయడంతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనూ రవి, సూపర్‌వైజర్ మరియా, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో కరెంట్ బిల్లుల మోత, రూ.5,420 కోట్ల భారం ప్రజలపై

(మొదటి పేజీ తరువాయి..)

ఇస్తున్నారు. ఇప్పుడు తెలంగాణలో అదే జరుగుతోంది. గత కాలానికి సంబంధించిన ఖర్చులను ఇప్పుడు ప్రజల నుంచి వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు.నవంబర్ నెలలో యూనిట్‌కు 30 పైసల చొప్పున, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేయనున్నారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు 29 నెలలు, టీజీఎన్‌పీడీసీఎల్‌కు 26 నెలల పాటు ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతి లభించింది. అంటే దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు ప్రతి నెలా ప్రజలు అదనపు బిల్లులు చెల్లించాల్సిందే.అంటే 100 యూనిట్లు వాడిన వినియోగదారుడికి నవంబర్ నెలలో రూ.30, డిసెంబర్ నెల నుంచి రూ.50 అదనపు భారం పడుతుంది. 200 యూనిట్లు వాడే మధ్యతరగతి కుటుంబానికి నవంబర్‌లో రూ.60, డిసెంబర్ నుంచి రూ.100 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. 300 యూనిట్లు వాడే కుటుంబానికి నవంబర్‌లో రూ.90, ఆ తర్వాత రూ.150 అదనపు భారం పడుతుంది. 500 యూనిట్లు వాడే పెద్ద కుటుంబాలు, చిన్న షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లు వంటి వాణిజ్య వినియోగదారులకు ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. వారికి నెలకు వందల రూపాయల అదనపు భారం పడే అవకాశం ఉంది. దీంతో చిన్న వ్యాపారులపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది.ఎల్‌నినో కరువు కష్టకాలంలో కరెంట్ ధరలు పెంచిన తెలంగాణ ప్రభుత్వం చర్య పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం కరువు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్న సమయంలోనే కరెంట్ ధరలు పెంచడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సరిగా కురవక, వ్యవసాయం దెబ్బతిని, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం తగ్గిన సమయంలో విద్యుత్ భారం పెంచడం సమంజసం కాదని రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాలు అంటున్నాయి.మూడు సంవత్సరాల పాలన వ్యవధిలోనే ఎల్‌నినో పేరుతో కరెంటు చార్జీల మోత మోపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాలు లేక పంటలు పండక, సరైన ఆర్థిక పరిస్థితి లేక ప్రజలు అల్లాడుతున్న సమయంలో మళ్లీ కరెంటు చార్జీలు మోపడంతో ప్రజలు భ్రాంతికి గురవుతూ కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారు.ఇప్పటికే మార్కెట్లలో బియ్యం ధరలు, తినే ఆహారానికి సంబంధించిన అన్ని వస్తువులపై ధరలు పెరగడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న సమయంలో మళ్లీ కరెంటు చార్జీల మోతుతో బాంబులు వేస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఈ నిర్ణయం మరింత భారం మోపనుంది. చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారాలు, స్వయం ఉపాధి పొందుతున్న వారిపై కూడా దీని ప్రభావం పడుతుంది. ఇప్పటికే కరెంట్ బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, మరింత పెరిగితే వ్యాపారాలు నడపడం కష్టమవుతుందని వారు చెబుతున్నారు.రైతులు, గృహ వినియోగదారులు, చిన్న పరిశ్రమలు అందరూ ఈ ట్రూ అప్ భారాన్ని మోయాల్సి వస్తుంది. ఇది కరెంట్ బిల్లుల రూపంలో ప్రతి నెలా ప్రజల జేబుకు చిల్లు పెడుతుంది.గృహ జ్యోతి పథకం కింద ఫ్రీ కరెంట్ అంటూనే మూడేళ్ల పరిపాలన ముగియకముందే ఎల్‌నినో పేరుతో మళ్లీ కరెంటు చార్జీలు మోపడం చాలా దారుణం, ఇది సరైన పద్ధతి కాదని ప్రజలు మండిపడుతున్నారు. గృహ జ్యోతి అంటూ గొప్పగా చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అదే విద్యుత్ పేరుతో ప్రజలపై భారీ బాదుడు బాదుతోంది. ఐదు సంవత్సరాల పాలన పూర్తయ్యే సమయంలో, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజలను మోసం చేసినట్టే అని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జల సంరక్షణకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం: అనంతపల్లి.

నీటి నిల్వే భవిష్యత్తుకు భరోసా.. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలని పిలుపు

బోయినపల్లి నవంబర్ 01 (విజన్ ఆంధ్ర):

గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ లక్ష్యంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రైతులు, గ్రామ ప్రజలు తమ ఇళ్ల వద్ద, వ్యవసాయ భూముల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా వివిధ రకాల నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు రకాల నీటి సంరక్షణ నిర్మాణాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

1 . ఇంకుడు గుంతలు: ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడానికి రూ.6,000 ఖర్చవుతుంది.

2 . బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు: ప్రతి వ్యవసాయ బోరుబావి వద్ద భూగర్భ జలాలు పెరిగేలా రీఛార్జ్ నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి రూ.35,000 ఖర్చవుతుంది.



3 . రూఫ్ వాటర్ హార్వెస్టింగ్: ప్రతి ఇంటికి వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకునే విధంగా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి రూ.6,000 ఖర్చవుతుంది.

4 . ఫామ్ పాండ్స్: రైతుల పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు 12ఐ12 మీటర్ల విస్తీర్ణంలో ఫామ్ పాండ్ నిర్మాణం చేపట్టే అవకాశం కల్పిస్తున్నారు.

ఈ నిర్మాణాల ఏర్పాటుకు సంబంధించి వి బి జి రామ్ జి పథకం ద్వారా నిధులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

రైతులు, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామంలో నీటి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనంత పల్లి, గ్రామ పంచాయతీ కార్యాలయం కోరుతోంది. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు.

నీటిని కాపాడండి.. వర్షపు నీటిని పెంచండి.. భవిష్యత్తును కాపాడండి. అని గ్రామ ప్రజలకు పోస్టర్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

సీతమ్మ లొద్ది ట్రెక్కింగ్ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రకృతి ప్రేమ, చరిత్రపై అవగాహన, సభ్యుల ఐక్యతే లక్ష్యంగా సాగింది - క్లబ్ అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్

రామగిరి నవంబర్ 01(విజన్ ఆంధ్ర)

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ హర్ష పర్యవేక్షణలో సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన సీతమ్మ లొద్ది వద్ద యువశక్తి పెద్దపల్లి లెంకల మహిపాల్ రెడ్డి మరియు పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేషన్,మార్కెటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రెక్కింగ్ ముఖ్య అధితులు జెండా ఊపి ప్రారంభించారు ఇట్టి కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది పాల్గొని ప్రకృతి అందాల నడుమ కొండలు, గుహలు, అటవీ ప్రాంతాలను సందర్శిస్తూ ట్రెక్కింగ్‌ను ఆనందంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సీతమ్మ లొద్ది ప్రకృతి సౌందర్యంతో పాటు దాని అపారమైన



చారిత్రక, పురావస్తు విశిష్టతను రాక్ ఆర్ట్ స్పెషలిస్ట్ డా.బి. ఎమ్ రెడ్డి ,ఫోటో జర్నలిస్ట్ రవీందర్ రెడ్డి,డిస్కవరీ మాన్ రత్నాకర్ రెడ్డి వివరించడం వల్ల తెలుసుకునే అవకాశం లభించింది.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు లయన్ డా. శరణ్య మారుతి యాదవ్ మాట్లాడుతూ సీతమ్మ లొద్ది తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన అద్భుతమైన వారసత్వ సంపద. సుమారు 1,000 అడుగుల పొడవు, 50 అడుగుల ఎత్తు కలిగిన ఈ భారీ రాతి గుహలో వేల సంవత్సరాల నాటి మానవ నాగరికత ఆనవాళ్లు, పురాతన రాతి చిత్రాలు, జంతువుల చిత్రాలు, అరచేతి ముద్రలు దర్శనమిస్తాయి. మధ్య శిలాయుగం నాటి చిత్రాలతో పాటు శాతవాహనుల కాలానికి చెందిన బ్రాహ్మీ లిపి శాసనాలు ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా శాతవాహన రాజకుమారుడు కుమార హకుసిరి పేరు ఉన్న శాసనం ఈ ప్రాంతానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.మన పెద్దపల్లి జిల్లాలో ఇంతటి అపురూపమైన చారిత్రక, ప్రకృతి సంపద ఉండటం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువతలో చరిత్ర, సంస్కృతి, ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంతటి అద్భుతమైన ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక, పర్యావరణ, చారిత్రక అవగాహన కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు చురుకుగా పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్మన్ మర్రి శరణ్య, ఐతం అజయ్, అఖిల, అత్తే మల్లికార్జున్, నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు నూతన చైర్మన్, సభ్యులను వెంటనే నియమించాలి

హోళియ దాసరి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల నరేశ్ హోలియ దాసరి డిమాండ్

వేములవాడ నవంబర్ 01 (విజన్ ఆంధ్ర)

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పదవీకాలం 2026 అక్టోబర్ 3తో ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన కమిషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించాలని హోళియ దాసరి హక్కుల పోరాట సమితి (ఎణఎూూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెండ్యాల నరేశ్ హోలియ దాసరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన కమిషన్ చైర్మన్‌గా ఉన్నత విద్యావంతులు, చట్టాలపై సంపూర్ణ



అవగాహన కలిగిన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి లేదా జిల్లా న్యాయమూర్తిని నియమించాలని కోరారు. అదేవిధంగా, ఎస్సీ కులాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, చట్టపరమైన పరిజ్ఞానం కలిగి, సామాజిక అంశాలపై అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్ సభ్యుల నియామకంలో ఎస్సీ ఉపకులాలన్నింటికీ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, ముఖ్యంగా ఎస్సీ ఉపకులాల సమస్యలపై అవగాహన కలిగి, ఆయా వర్గాల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారిని సభ్యులుగా నియమించాలని కోరారు. అన్ని ఉపకులాలకు సమాన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఉద్యమకారులు, దళిత మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేసే విధంగా హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ నెక్లెస్ రోడ్డులో వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు, అన్ని ఎస్సీ ఉపకులాలకు సమాన అవకాశాలు, న్యాయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన కమిషన్ ఏర్పాటుతో పాటు అవసరమైన చర్యలు చేపట్టాలని హోళియ దాసరి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరింది.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి

అల్లీపూర్ గ్రామ బీజేపీ నాయకుల వినతిపత్రం.. సానుకూలంగా స్పందించిన ధర్మపురి అరవింద్

జగిత్యాల డివిజన్ ఇంచార్జి నవంబర్ 1(విజన్ ఆంధ్ర):

జగిత్యాల జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పర్యటనలో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ను అల్లీపూర్ గ్రామ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా అల్లీపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై ఎంపీ ధర్మపురి అరవింద్ సానుకూలంగా స్పందించడు. ఈ కార్యక్రమంలో జగిత్యాల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు శ్రీరాముల ఆదర్శ రాయికల్ మండల ఓబీసీ అధ్యక్షుడు గోడ్డంట్ల రాజ గోపాల్ గౌడ్, జగిత్యాల్ జగిత్యాల్ జిల్లా కోశాధికారి గోడ్డంట్ల అనిత రాజశేఖర్ గౌడ్, అంగరి నితీష్ పాల్గొన్నారు.

ఢిల్లీలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీ.....

రామ్‌లీలా మైదానంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ఎమ్మెల్యే వేముల వీరేశం...

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల ఓటు



హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, ప్రజల ఓటు హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసుల అంజనేయులు గౌడ్, దండెం ప్రభాకర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ మహా ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ మండల నాయకులు



ఓట్ చోరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఆదివారం జరుగుతున్న కాంగ్రెస్ మహా ధర్నాకు మద్దతుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో అడ్డగూడూరు మండల కాంగ్రెస్ నాయకులు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంలీలా మైదానం వేదికగా జరుగుతున్న పోరాటం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. ధర్నాలో పాల్గొన్న వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, కాంగ్రెస్ నాయకులు ఇటికాల చిరంజీవి, మందుల భానుకుమార్, వినోద్ రెడ్డి, డి. రేపాక సర్పంచ్ ముక్కామల శ్రీకాంత్ యాదవ్, అజింపేట సర్పంచ్ లింగస్వామి, కంచనపల్లి సర్పంచ్ చెడే అంబేద్కర్, బాలెంల సైదులు, నర్సయ్య తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో..?







రూ.2.77 కోట్లతో చేపట్టిన నిర్మాణం 80 శాతం పూర్తి.. అయినా నిధుల విడుదలలో జాప్యం

వర్షాకాలం వస్తే గ్రామాలకు రాకపోకలు బంద్.. విద్యార్థులు, రైతుల కష్టాలు ఎన్నాళ్లు?

గత ప్రభుత్వం పనులకు ఆమోదం తెలిపి నిధుల విడుదలలో నిర్లక్ష్యం.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ముందుకు సాగని నిర్మాణం

మెట్ పల్లి డివిజన్, నవంబర్ 1 (విజన్ ఆంధ్ర)

యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన మాత్రం పూర్తి కావడం లేదు. ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ నిర్మాణం నిధుల కొరత, బిల్లుల పెండింగ్ కారణంగా మధ్యలోనే నిలిచిపోయింది. పాలకులు మారినా గ్రామస్తుల కష్టాలు మాత్రం మారడం లేదు. రూ. 2.77 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వంతెన పనులు సుమారు 80 శాతం పూర్తయినా, మిగిలిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమేనా.. వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత లేదా? అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

వర్షాకాలం వస్తే గ్రామానికి వెళ్లేదెలా?

జగిత్యాల జిల్లా

అఖీర్ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామానికి చేరుకోవాలంటే యామాపూర్ మీదుగా ఒక మార్గం, మల్లాపూర్ మండలంలోని నడికుడ మీదుగా మరో మార్గం వుంది. ఈ రెండు మార్గాల్లోనూ లో లెవెల్ వంతెనలు ఉండటంతో వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. గత సంవత్సరం నడికుడ వైపుగల దానిని రోడ్డు మరమ్మత్తుల్లో భాగంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మించారు. యామాపూర్ నుంచి వచ్చే మార్గం నిర్మాణదాశాల్లో ఆగిపోవడంతో వర్షాకాలంలో ఫకీర్ కొండాపూర్ ఇతర ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయినా పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనుల కోసం రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వరదల కారణంగా విద్యార్థులు ప్రయాణించలేక యామాపూర్ గ్రామంలోనే తాత్కాలికంగా బస ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు కూడా తలెత్తాయి.

రూ.2.77 కోట్లతో ప్రారంభమైన నిర్మాణం.. 80 శాతానికే పరిమితం!

గ్రామస్తుల దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు రూ. 2.77 కోట్ల ఆర్అండ్బీ నిధులతో యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య హై లెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మెట్పల్లికి చెందిన హిమాలయ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణ పనులు చేపట్టింది. ఇప్పటివరకు వంతెన పిల్లర్ల నిర్మాణం సహా సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ తదుపరి పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లు అందలేదని స్థానికంగా చెబుతున్నారు. ఫలితంగా కోట్లాది రూపాయలతో చేపట్టిన ప్రజా అవసరాల ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలిపోయింది.

గత ప్రభుత్వంలోనూ జాప్యమే.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి!

గత ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులకు ఆమోదం తెలిపి పనులు ప్రారంభించినప్పటికీ, అవసరమైన నిధుల విడుదల, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చోటుచేసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా పనులు పూర్తవుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారం కాకపోవడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంపై బాధ్యత నెట్టడం, ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడం మధ్య గ్రామస్తుల సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

తాత్కాలిక రహదారులే దిక్కు.. వరదలకు కొట్టుకుపోతున్న మార్గాలు!

వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షాకాలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి పలుమార్లు వరద ప్రవాహానికి కోతకు గురైంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా, గ్రామస్తులే స్వయంగా ముందుకు వచ్చి రహదారిని పునరుద్ధరించుకుని రాకపోకలు కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతిసారీ వరదలు వచ్చినప్పుడు ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

వంతెన పూర్తయితే తగ్గనున్న ప్రయాణ దూరం..

ఈ హై లెవెల్ వంతెన నిర్మాణం పూర్తయితే ఫకీర్ కొండాపూర్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. అంతేకాకుండా నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

ఇప్పటికైనా మేల్కొనాలి.. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి!

ప్రజల ప్రాణాలు, ప్రయాణ భద్రతతో ముడిపడిన ఈ వంతెన నిర్మాణాన్ని ఇంకెంతకాలం నిర్లక్ష్యం చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయలతో ప్రారంభించిన పనులు 80 శాతం పూర్తయ్యాక నిలిచిపోవడం ప్రజాధనంతో పాటు ప్రజల ఆశలను కూడా నిరుపయోగం చేస్తున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్అండ్బీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిపై సమీక్షించాలి. కాంట్రాక్టర్కు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయడంతో పాటు మిగిలిన పనులకు అవసరమైన నిధులు విడుదల చేసి నిర్దిష్ట గడువులోగా వంతెనను పూర్తి చేయాలి. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ ఫకీర్ కొండాపూర్ ప్రజల రవాణా కష్టాలు మాత్రం తీరడం లేదు. ఈసారైనా హామీలతో సరిపెట్టకుండా వంతెనను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మూడేళ్లుగా నిలిచిన వంతెన పనులు.. ప్రజలకు తప్పని తిప్పలు!

గుంటి దేవయ్య

మాజీ సర్పంచ్ ఫకీరు కొండాపూర్

యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులు బిల్లులు మంజూరు కాక గత మూడేళ్లుగా నిలిచిపోయాయని, వంతెన పనులు పూర్తికాక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు మంజూరు చేసి, వచ్చే వర్షాకాలంలోపు వంతెన పనులు పూర్తి చేయాలని కోరారు. వర్షాకాలంలో గ్రామానికి బస్సులు కూడా రాకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు సహా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలి.

కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి: బొడ్డు రవీందర్ సైకిల్ యాత్ర.

బోయినపల్లి నవంబర్ 01(విజన్ ఆంధ్ర):

కేసీఆర్ గారి గెలుపే ధ్యేయంగా బొడ్డు రవీందర్ సైకిల్ యాత్రకు బోయినపల్లిలో ఘన స్వాగతం.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ వరకు బొడ్డు రవీందర్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రకు బోయినపల్లి మండల కేంద్రంలో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కత్తెరపాక కొండయ్య మాట్లాడుతూ.. గత ఐదు రోజుల క్రితం ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర నేడు ఉదయం 11:00 గంటలకు బోయినపల్లి మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య గారు బొడ్డు రవీందర్ గారికి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ వరకు ప్రతి ప్రాజెక్టును కలుపుతూ, నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సరైన సమయంలో సాగునీరు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడం, రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ సైకిల్ యాత్ర ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సైకిల్ యాత్రలో పాల్గొన్న ఉప్పు



రాజు కుమార్, మేకల నవీన్, పరిపెల్లి అనిల్, గుండబోయిన శ్రీనివాస్, ముత్యం లక్ష్మణ్, వాసు, సర్వేశ్ కుమార్, రాజేష్ గార్లకు బోయినపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని, కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని బోయినపల్లి మండల బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల తరఫున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, జంపుక ఆనంద్, మెడుదుల మల్లేశం, ముద్దం రవి, ఆనంద్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిందం రమేష్, కవ్వంపెల్లి రాములు, పాపారావు, కమల్ గౌడ్, కన్నం సాగర్, మల్లరపు చందు శ్రేయాస్ బొజ్జ ప్రభాకర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటిన గౌడ సోదరులు

జూలపల్లి నవంబర్ 01(విజన్ ఆంధ్ర):

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన బంధారపు సురేష్ ఇటీవలే వారి ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఆత్మహత్య చేసుకొని మరణించగా గ్రామ గౌడ సంఘము లోని కొంత మంది మనసున్న మారాజులు కలిసి తల కొంత పోగు చేసి 11000/– రూ,, లను గౌడ సంఘము ఉపాధ్యక్షులు తీగల అశోక్ ఆధ్వర్యంలో గౌడ సంఘము అధ్యక్షులు పల్లె రాములు చేతుల మీదుగా వారి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు,ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబానికి మన వంతుగా చేదోడు



వాదోడుగా ఉండటం మన మానవత్వానికి ప్రతీక అని ఈ కార్యక్రమానికి సహకరించి తమ వంతుగా చిన్న పెద్ద సాయం చేసిన మా గౌడ సోదరులందరికి కూడా పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాగే ఇక ముందు కూడా ఇలాంటి సేవ కార్యక్రమంలో పాల్గొనడానికి గౌడ సోదరులందరూ కూడా పెద్ద ఎత్తున తమ సాయం అందించడంలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డమిడి శ్రీనివాస్,ఉయ్యాల శ్రీనివాస్ (మీ సేవ),బుర్ర నర్సయ్య,ఉయ్యాల వెంకటేశం,బుర్ర మహేష్,గుండు నరేష్,గుండు పర్శరాములు, జంపయ్య,బూరుగు సాగర్,గుండు మహేష్,బుర్ర సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సేవలకు గుర్తుగా మిలీనియం అసోసియేషన్ చేయూత

చిగురుమామిడి నవంబర్ 01 (విజన్ ఆంధ్ర):

చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో గతంలో శారదా నికేతన్ ఉన్నత పాఠశాలను స్థాపించి,సుదీర్ఘకాలం పాటు కరస్పాండెంట్‌గా సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన విద్యాదాత, పరాంకుశం రవీందర్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు.ఆయన అందించిన విద్యా సేవలను గుర్తుచేసుకుంటూ,ఉపాధ్యాయునిపై ఉన్న అపారమైన అభిమానంతో ఆదివారం 'మిలీనియం అసోసియేషన్' సభ్యులు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, అసోసియేషన్ తరపున పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని




అందజేశారు. ఈ కార్యక్రమంలో రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్,మిలీనియం అసోసియేషన్ అధ్యక్షులు పరుపాటి మహిపాల్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ గందె చిరంజీవి,కోశాధికారి లంకసిరి శ్రీనివాస్,జాయింట్ సెక్రెటరీ చిప్ప తిరుపతి,అసోసియేషన్ సభ్యులు బండారి రవికుమార్,నూకల వెంకటేశ్వర్లు,లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అర్చకులు పరాంకుశం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీలో లా విద్యార్థిని ఆత్మహత్య.

హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం..

కొత్తపల్లి నవంబర్ 01, విజన్ ఆంధ్ర :



కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో విషాద ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటున్న ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని డక్కాలి చంద్రకళ (28) ఆత్మహత్యకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ఆమె హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతిచెందారు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లేందుకు తోటి విద్యార్థినులు పిలిచినా గది తలుపులు తీయకపోవడంతో సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. వారు తలుపులు పగలగొట్టి చూడగా చంద్రకళ ఉరివేసుకుని కనిపించారు. ఆమె మెడలో బ్లూటూత్ ఉండటంతో పాటు ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న కొత్తపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం..

లైసెన్సుడ్ సర్వేయర్ లైసెన్స్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

గంభీరావుపేట నవంబర్ 1 (విజన్ ఆంధ్ర)



రాష్ట్రప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన విధులు నిర్వర్తించడంలో అలసత్వం ప్రదర్శించిన లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సస్పెన్షన్ చేశారు.

గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతుండగా, సర్వే కోసం కేటాయించిన లైసెన్సుడ్ సర్వేయర్ ఎం.బాలకృష్ణ గత కొన్ని రోజుల నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొనకుండా, గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత లైసెన్సుడ్ సర్వేయర్ పై చర్యలు తీసుకున్నారు.లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

మల్లాపూర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం!

జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

మెట్‌పల్లి డివిజన్, నవంబర్ 1 (విజన్ ఆంధ్ర):

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కార్యవర్గ సభ్యులను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. మల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సభావత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి



బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రామ్ చందర్ రెడ్డి, కోశాధికారి అశోక్ రెడ్డి, జిల్లా ఈసీ సభ్యుడు రాజేష్, సంయుక్త కార్యదర్శి మాధుకర్, గౌరవ అధ్యక్షుడు ర్యాగల్ల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు శేఖర్, శ్యాంలను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతే సంఘాల బలోపేతానికి పునాది అని పేర్కొన్నారు. యూనియన్, ప్రెస్ క్లబ్‌ల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా తోటి జర్నలిస్టులు ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలుస్తూ, పరస్పర సహకారంతో జర్నలిస్టు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ సభ్యుడు షేక్ సాజిద్, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి పింజారి శివకుమార్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేశ్, కార్యవర్గ సభ్యుడు కుర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం.. కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి

కొడిమ్యాల, నవంబర్ 01 (విజన్ ఆంధ్ర)

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు గ్రామ శివారులో కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు హరీష్ మొట్టవాని (52) తన భార్య రియా మొట్టవానితో కలిసి టాటా నెక్సాన్ కారు (టీఎస్ 09 ఎఫ్ డబ్ల్యు 4393)లో ప్రయాణిస్తున్నారు.

ఈ క్రమంలో పూడూరు గ్రామ శివారులోని ఎన్‌హెచ్-563పై కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ (టీఎస్ 07 యుఎఫ్ 9569) డ్రైవర్ ఉత్రేశ్వర్ (మహారాష్ట్రకు చెందిన వ్యక్తి) అతివేగంగా, అజాగ్రత్తగా



నడుపుతూ కారును బలంగా ఢీకొట్టాడు.

ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హరీష్ మొట్టవానికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని రెనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆయన భార్య రియా మొట్టవానికి గాయాలయ్యాయి.మృతుడి సోదరుడు హరీష్ తేజోవాన్ మొట్టవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంటైనర్ లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కొడిమ్యాల ఎస్ఐ ఏ. నరేష్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గంభీర్‌పూర్ శివారులో ఘటన.. చికిత్స పొందుతూ మృతి

కథలాపూర్, నవంబర్ 01 (విజన్ ఆంధ్ర): మండలంలోని గంభీర్‌పూర్ గ్రామ శివారులో అక్టోబర్ 31, 2026న జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దకాపు అశోక్ అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశోక్ ప్రస్తుతం బొమ్మెన గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం 3:20 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం (టూ 25 టూ+ 9130)పై బొమ్మెన నుంచి



మోత్కూరు రావుపేటకు పనిమీద వెళ్తుండగా గంభీర్‌పూర్ శివారులో ప్రమాదం జరిగిందని తెలిపారు.ఎదురుగా వస్తున్న టాటా ఇంట్రా వాహనం (టూ 39 ఖజ 5579) డ్రైవర్ సలంగన మాలకొండయ్య అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడంతో వెనుక భాగంలో అమర్చిన కాంక్రీట్ మిల్లర్ ఊడిపోయి అశోక్‌కు తగిలింది. దీంతో తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి తండ్రి పెద్దకాపు అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపారు.

మోతె చెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నిధులు మళ్లించకుండా నిర్దేశిత పనులకే వినియోగించాలి: ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల డివిజన్ ఇంచార్జి నవంబర్ 1(విజన్ ఆంధ్ర)

పట్టణ అభివృద్ధిలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న మోతె చెరువు సుందరీకరణ పనులను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌తో కలిసి బీజేపీ జగిత్యాల



నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీ పరిశీలించి, మంజూరైన నిధులను ఇతర పనులకు మళ్లించకుండా నిర్దేశిత అభివృద్ధి పనులకే వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం చేయకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, కౌన్సిలర్లు నిమ్మల నాగరాజు, గట్టిపెళ్లి మానస జ్ఞానేశ్వర్‌తో పాటు జిల్లా, పట్టణ, మండల స్థాయి పార్టీ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓరియంటేషన్

ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్య అభ్యసించే సువర్ణావకాశం: కోఆర్డినేటర్ డా. ఇ. శంకర్

తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య, వయసుతో సంబంధం లేకుండా చదువుకునే అవకాశం

కోర్సుల విధానం, పాఠ్య సామగ్రి, అసైన్‌మెంట్లు, పరీక్షలపై విద్యార్థులకు పూర్తి అవగాహన

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, ఇబ్రహీంపట్నం, నవంబర్ 01:



ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అభ్యాసక సహాయ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.కోఆర్డినేటర్ డా. ఇ. శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కౌన్సెలర్ డి.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ పాల్గొన్నారు. పలువురు కౌన్సెలర్లు కూడా హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

కోర్సుల విధానంపై స్పష్టత

ఈ సందర్భంగా కోర్సుల విధానం, పాఠ్య సామగ్రి ఎలా అందుతుంది, అసైన్‌మెంట్ల సమర్పణ విధానం, పరీక్షల నిర్వహణ తదితర అన్ని అంశాలపై విద్యార్థులకు సవివరంగా అవగాహన కల్పించారుఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న ప్రత్యేక అవకాశాలను వివరించారు.

తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య

తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను పొందవచ్చని, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా చదువుకునే అవకాశం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా లభిస్తుందని తెలిపారు.ఈ విద్య ఉద్యోగ అవకాశాలకు, ఉన్నత విద్యకు ఎంతో ఉపయోగపడుతుందని, కాబట్టి విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్, కౌన్సిలర్లు సూచించారు

పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాసాచారి, సైదిరెడ్డి, బుచ్చయ్య, శ్రీనయ్య, జి. రాములు, భాగ్యలక్ష్మి, సింహయ్య, డా. తోట రాములు, జూనియర్ అసిస్టెంట్ శ్రీహరి, ఆఫీస్ సబార్డినేట్ డి. సాయికుమార్ పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్. రాధిక విద్యార్థులకు, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపి, విజయవంతంగా కార్యక్రమం నిర్వహించినందుకు అభినందించారు.

ధన్వాడ లో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా

రామగిరి నవంబర్ 01(విజన్ ఆంధ్ర)

తెలంగాణ రాష్ట్ర ఐటీ భారీ పరిశ్రమ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు తో ముత్తారం మండల మాజీ జడ్పిటిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం సరదా సంభాషణలో భాగంగా చిరునవ్వులు చిందిస్తున్న మంత్రివర్యులు వారితో పాటు



ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి పెద్దపెల్లి జిల్లా గ్రంధాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్ వివిధ జిల్లాల నాయకులతో సరదా సన్నివేశం.

తరాలు మారినా తరగని అభిమానం..

ఘనంగా వనమా 82వ జన్మదిన వేడుకలు.!

రాజకీయాలకు అతీతంగా ఒక్కటైన నేతలు..!

వనమా జన్మదిన వేడుకల్లో జనసంద్రం!

కొత్తగూడెం బ్యూరో నవంబర్ 01(విజన్ ఆంధ్ర)





ఒక నాయకుడిపై అభిమానం కాలంతో పాటు తగ్గిపోతుందా? వయసు పెరిగే కొద్దీ ప్రజలకు దూరమవుతారా? కానీ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విషయంలో మాత్రం అందుకు భిన్నమైన దృశ్యం కనిపించింది. ఆయన 82వ జన్మదిన వేడుకలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పాత పాల్వంచ జనసంద్రంగా మారింది. సుమారు పదివేల మంది హాజరైన ఈ వేడుకలు పట్టణంలో ప్రత్యేక సందడిని నెలకొల్పాయి. ఉదయం నుంచే వనమా నివాసం వద్ద సందడి ప్రారంభమైంది. జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా నలుమూలల నుంచి అభిమానులు, నాయకులు తరలివచ్చారు. పూలగుచ్ఛాలు, భారీ పూలమాలలు, శాలువాలతో వనమా దంపతులను సత్కరించారు. అభిమానుల నినాదాలతో పాత పాల్వంచ పరిసరాలు మార్మోగాయి

కళాకారుల ప్రదర్శనలు.. గుర్రపు బగ్గీపై ఊరేగింపు

వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటలకు వనమా నివాసం నుంచి భారీ ఊరేగింపు ప్రారంభమైంది. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీపై వనమా దంపతులను సభా ప్రాంగణానికి తీసుకెళ్లారు. సుమారు 200 మంది కళాకారులు గిరిజన కోలాటాలు, లంబాడీ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. బాణసంచా పేలుళ్లు, అభిమానుల కేరింతల మధ్య ఊరేగింపు కొనసాగింది. దారిపొడవునా పూలవర్షం కురిపిస్తూ



అభిమానులు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా భారీ వేదిక ఏర్పాటు చేశారు. వనమా దంపతులు వేదికపైకి చేరుకోగానే అభిమానులు



పెద్దఎత్తున నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ వనమా దంపతులు అభివాదం చేస్తూ ఆత్మీయంగా పలకరించారు. అతిథులు, అభిమానుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

సర్పంచిగా మొదలై మంత్రిగా ఎదిగిన ప్రస్థానం



పాల్వంచ సర్పంచిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వనమా వెంకటేశ్వరరావు అంచెలంచెలుగా ఎదిగి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులు ఎదురైనా ప్రజలతో తన అనుబంధాన్ని కొనసాగించారు. కార్మికులు, కర్షకుల సమస్యలపై పోరాటాలు, నిరాహార దీక్షలు చేపట్టిన సందర్భాలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేశారు. కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయాల్లో వనమా ప్రస్థానం ప్రత్యేకమని, ఆయనతో తమకున్న అనుబంధం రాజకీయాలకు అతీతమని పలువురు నాయకులు పేర్కొన్నారు. వివిధ తరాలకు చెందిన అభిమానులు వేడుకలకు హాజరుకావడం విశేషంగా నిలిచింది.

ఒకే వేదికపై వివిధ పార్టీల నాయకులు



ఈ వేడుకల్లో రాజకీయ ఐక్యతకు సంబంధించిన ఆసక్తికర దృశ్యం కనిపించింది. రాజకీయంగా వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ పలువురు నాయకులు ఒకే వేదికపైకి వచ్చి వనమాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గడల శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కె.వి. రంగా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, సామాజికవేత్తలు, వ్యాపారవేత్తలు, పుర ప్రముఖులు హాజరై వనమాను సత్కరించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి వ్యక్తిగత అనుబంధాలకు ప్రాధాన్యతనిస్తూ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరడం ఈ వేడుకలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది.

82వ జన్మదిన వేడుకల సందర్భంగా పాత పాల్వంచలో కనిపించిన జనసందోహం, వివిధ పార్టీల నాయకుల హాజరు, అభిమానుల ఉత్సాహం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వయసు 82కు చేరినా తనను కలవడానికి, శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అభిమానుల సంఖ్య ఈ వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించింది.

జములపేట గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత.....

గ్రామ సర్పంచ్ బండారి మహేందర్....

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి



ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో, భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో జములపేట గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది.గతంలో వివిధ కారణాల వల్ల ఇళ్ల నిర్మాణానికి నోచుకోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా జములపేట గ్రామానికి మొత్తం 16 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, వారిలో ముగ్గురు లబ్ధిదారులు వివిధ కారణాల వల్ల ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. దీంతో వారి స్థానంలో అర్హులైన మరో ముగ్గురిని ముసిరిగాని స్వామి ఎర్రనోల్ల అమృత తాడిపత్రి మహాలక్ష్మి ఎంపిక చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో నూతనంగా ఎంపికైన ముగ్గురు లబ్ధిదారులకు ఈరోజు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బార్ల మల్లికార్జున్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బండారి మహేందర్, ఉప సర్పంచ్ త్రిపుర బోయిన మల్లేష్ యాదవ్,

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వి. సుబ్బారావు

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం



చుట్టింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారావు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం అలింగాపురం గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన బోయిన సైదమ్మ మట్టయ్య, ఉప సర్పంచ్ ప్రభుదాసు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి సునీత, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అందే రామకృష్ణ,స్థానిక నాయకులు పోరెడ్డి వీరారెడ్డి వెంకట్రామయ్య సీతయ్య ,మహేష్ వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాడు నావోడు... నేడు నీవోడు...!





ఎవడొచ్చిన ఫుట్కేసర్‌కు ఏమి ఎలగపెట్టకపాయె..!!

- నాయకులు మారినా నాటకాలు మారలేదు...

- ఫుట్కేసర్ తలరాత మారలేదు!

- 18 ఏళ్లుగా పట్టాలెక్కని బ్రిడ్జి

- హామీల రైల్లో దూసుకెళ్తున్న నాయకులు

- నిరీక్షణ పట్టాలపై ఫుట్కేసర్ ప్రజలు!"

- తాడోపేడో తేల్చుకోనున్న ఫుట్కేసర్..

ఫుట్ కేసర్, నవంబర్ 1, (విజన్ ఆంధ్ర) :



నాడు నా వోడు వచ్చాడు.... నేడు నీవోడు వచ్చె.... ఎవడొచ్చి ఫుట్కేసర్ కు ఎమీ ఎలగపెట్టాడురా.... అని ఒకరికి ఒకరు మొహాలు చూసుకుంటున్న వివిధ పార్టీల స్థానిక నాయకులు. ఇంత పొడుగు అంత పొడుగు అని గొప్పలు చెప్పుకోవడమేతప్ప ఎవడి పతారా ఫుట్కేసర్ సమస్యలపై పని చేయడం లేదని స్థానిక ప్రజలకు బాగా అర్థమైంది. ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు వీడు నా ఎమ్మెల్యే, వీడు నా ఎంపీ, వీడు నా మంత్రి అంటూ వెంటబెట్టుకొచ్చి ఓటు అడిగితే చీపురు కట్టల తో వీపులు విమానం మోగిస్తామంటున్న స్థానిక ప్రజానీకం.

రాజకీయ పార్టీల బడా నాయకులు ప్రతిసారి ఎన్నికల సమయంలో ప్రజల అవసరాల మీద దెబ్బ కొడుతూ, ఓట్లు వేయించుకొని గద్దలెక్కి కూర్చున్న తర్వాత, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేస్తూ వారి పదవి కాలము ముగిసే అంతవరకు ఇక్కడి సమస్య పై కన్నెత్తి కూడా చూడట్లేదని విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. దశాబ్దాలు గా మారుతున్న ఇక్కడి సమస్యలు మాత్రం మారడం లేదు

సమస్యలను పరిష్కరించడంలో వీరికి అడ్డు గోడగా నిలిచింది ఎవరు....



సమస్యను సాకుగా చూపుతూ రాజకీయం చేయడమా, లేక సమస్యలు ఉన్నంతకాలం ప్రజాప్రతినిధులు మా వెంట తిరుగుతారని ఊహలో ఉన్నారా?. ఇదేనా వీరి రాజనీతి....ఏ పార్టీ వచ్చి ఏం చేసింది అని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ ప్రశ్నకు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధుల దగ్గర సమాధానం లేదు. ఎందుకంటే మ్మెల్యేలు మంత్రులు రాగానే స్థానిక నాయకుల భుజాల మీద చేతులు వేస్తూ, వారి పేరు పెట్టి పదిమందిలో పిలవడంతో స్థానిక నాయకులు ఎంతో ఎత్తుకు ఎదిగిన ఫీలింగ్ తో వారికి పబ్బం పడుతూ వారు చెప్పినట్టు వింటు తలలూపుతున్నారే తప్ప ప్రశ్నించడం లేదు. ఫుట్కేసర్ పట్టణంలో నెలకొన్న సమస్యలు సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదంటే దానికి కారణం ఎవరు. మరెవరో కాదు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులే..... వారి నిర్లక్ష్యమే దీనికి కారణం .... సంకల్పం ఉంటే చాలదు ఆ సమస్య పట్ల దృడ సంకల్పం ఉండాలి, పట్టుదల ఉండాలి. దీనికి తోడు అఖిలపక్షం ఏకమై పొద్దు పొద్దున్నే కోడి కూసినట్లుగా ఎమ్మెల్యేల, ఎంపీల, మంత్రుల చెవులలో కూస్తూ, చెవులు పగిలేలా మన గలాన్ని, మన సమస్యను వినిపించాలి. అప్పుడు గాని బడా నాయకులు కదిలేలా లేరని మీరు తెలుసుకోవాలి. ఫుట్కేసర్ ప్రజల ఓట్లు వీరు వేసుకొని గెలవలేదా?.. ఓట్ల కోసం మీ దగ్గరకు వచ్చినప్పుడు ఇట్టి సమస్యలపై మీరు అడగలేదా?.. ఒకవేళ మీరు అడిగితే వారు ఇచ్చిన హామీ ఏమైంది?.. ఎంతమంది ఎమ్మెల్యేలు మారారు, ఎంతమంది మంత్రులు మారారు, ఎంతమంది ఎంపీలు మారారు. మరి వారికి ఈ ఫుట్కేసర్ సమస్యలు తెలియదా, వారికి మొత్తం తెలుసు. మీకే ఏం తెలియక ప్రతిరోజు ఫోటోలకు ఫోజులిస్తూ మినీ మినీ జ్ఞానంతో రాసే పాత్రికేయ మిత్రుల వార్తలను ఉదయాన్నే చూసుకొని మురిసి పోతున్నారు. ఇది మీ రాజకీయ జీవితం. పాత్రికేయుల పాత్ర నీరు గారి పోతుంది. ఎలాంటి రాజకీయ అనుభవము లేని గల్లీ లీడర్ల వార్తలు రాస్తూ వారి చేతివాటాన్ని సైచుస్తూ ఆనందపడుతున్నారే తప్ప ప్రజా సమస్యలను వెలికి తీయడంలో విఫలమయ్యరని జర్నలిజం అనే పదానికే మచ్చ చేస్తున్నారని మేధావులు అసహ్యించుకుంటున్నారు. సమస్యలకు అధికారులకు మధ్య వారధిగా ఉండి, సమస్యలను పరిష్కరించే దిశగా పాత్రికేయుడు పాత్ర పోషించాలని సమాజం కోరుకుంటుందని పలువురు వాపోతున్నారు. ఫుట్కేసర్ కు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను చూసి నవ్వుకుంటున్నారు. ప్రతిరోజు ఫుట్కేసర్ మీదుగా హైదరాబాదు నగరానికి వెళ్లి వస్తుంటారు ఆ క్రమంలో ఇక్కడి సమస్యలపై చేస్తున్నటువంటి రాజకీయాలను చూస్తూ, ఫుట్కేసర్ కు సరియైన నాయకులు లేడన చర్చ జరుగుతుంది. ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోలేకపోతున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులను చూసి జాలి పడుతున్నారు.

దీనికి నిదర్శనాలు కొన్ని ఉన్నాయి...

ఫుట్కేసర్ లో రైతుల సమస్య కలగానే మిగిలిపోయింది, ఫుట్కేసర్ లో గురుకుల్ సమస్య నీరు కారి పోతుంది. రైల్వే బ్రిడ్జి పునాదికి వయస్సు అయిపోతుంది. ఫిర్యాదులు చేసి చేసి స్థానిక నాయకుల వయసు కూడా దగ్గర పడుతుంది. ఇంకెన్నడు మారేది. ఆలోచించవలసిన విషయం ఇది!...

కనీసం నేడు జరిగే ఫుట్కేసర్ బంద్ అనే కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఈ దెబ్బతో రాజకీయం నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తితే వచ్చే సౌండ్ లా ఉండాలి మీ బంద్..... దెబ్బకు ప్రభుత్వం దిగి రావాల్సిందే అలా ఉండాలి ఫుట్కేసర్ బంద్... ఇక వేచి చూద్దాం ఏం జరుగుతుందో.

నక్కల జానమ్మని నివాళు లర్పించిన.....బిజెపి రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్.....



పెద్దవూర మండలం, తుంగతుర్తి గ్రామపంచాయతీలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన ప్రొఫెసర్ నక్కల జానారెడ్డి మాతృమూర్తి స్వర్గీయ నక్కల జానమ్మ దశదిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈకార్యక్రమంలో రంజిత్ అన్న యువసేన అధ్యక్షులు కుంటిగొర్ల.రాజశేఖర్ యాదవ్,బీజేపీఎం జిల్లా ఉపాధ్యక్షులు కడియం సైదులు,ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెండే అనిల్ కుమార్ యాదవ్,తెలకపల్లి శ్రీను,ముద్ద నవీన్ కుమార్,కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్

పట్టణ కేంద్రానికి చెందిన సోమశంకర్ గారి కుమార్తె వివాహ



కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సోమ శివకుమార్, నెల్లుట్ల శ్రీశైలం, బీబీనగర్ మండలం గ్రంధాలయ అధ్యక్షులు పంజాల సదానంద గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పలంచి శ్రీకాంత్, మాజీ ఉప్పసర్పంచ్ పంజాల సత్తయ్య గౌడ్, సోమ ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు టంటం రాఘవేందర్, మాజీ వార్డు సభ్యులు బెండ ప్రవీణ్, సామల వేణు, మరియు వివల్దాస్ మహేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు కాసుల సాయి గౌడ్, గోరికంటి మహేశ్, పాల్గొనడం జరిగింది.

స్వర్ణ గిరిలో స్వామివారికి నిత్య కళ్యాణం

విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా



నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.